సాక్షి ప్రకాశం

బుధవారం । 23 । ఆగస్టు । 2023



రాష్ట్రంలో విద్యకు పెద్దపీట

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేశారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.

- IIలో..



నిర్మాణాలు వేగవంతం చేయండి

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బాలినేని పర్యటన ఇలా..



ఒంగోలు: మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక లాయరుపేటలోని రైతుబజారు ఎదురుగా ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం వద్ద, గం.9.30 కు ప్రకాశం భవనంలో, గం.10.30కు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాల్లో పాల్గొంటారు. 11.30 గంటలకు రిమ్స్‌లో సత్యసాయి సేవ నిత్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు. 11.40 గంటలకు రిమ్స్ ప్రాంగణంలో సొంత నిధులతో ఉచిత అంబులెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో, 11.50 గంటలకు రిమ్స్ ప్రాంగణంలో క్యాన్సర్ కనుగొనే మిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 12.30 గంటలకు ఒంగోలు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి రూ.120 కోట్లతో నిర్మించిన గుండ్లకమ్మ జలాశయం మంచి నీటి అభివృద్ధి పథకం ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి నగరంలోని 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

అక్రమ లే అవుట్‌లు తొలగించాలి

ఒంగోలు అర్బన్: అనుమతులు లేని అక్రమ లే అవుట్‌లను తొలగించాలని, అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనధికారికి లే అవుట్‌లు, అక్రమ నిర్మాణాలపై డీపీఓ, ప్లానింగ్ అధికారులు, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ అన్నీ శాఖలను సమన్వయ పరుస్తూ రూపొందించిన ప్రామాణిక పద్ధతి ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ని పక్కాగా అనుసరించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్-2020 ప్రకారం అనధికారిక లే అవుట్‌ల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

నేడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

ఒంగోలు: ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు 152వ జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎం.అంజల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక ప్రకాశం భవనంలోని ప్రకాశం పంతులు విగ్రహానికి రాష్ట్ర మంత్రి, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఇతర అధికారులు పుష్పమాలాలంకరణ చేస్తారన్నారు. అనంతరం ఒంగోలు మండలంలోని దేవరంపాడు విజయస్థూపం వద్ద జాతీయ జెండా ఆవిష్కరిస్తారని, నాగులుప్పలపాడు మండలంలోని వినోదరాయునిపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఆంగ్ల మాధ్యమ బోధకుల అవార్డు ఎంపికకు పరీక్ష

ఒంగోలు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో సబ్జక్టులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు అదనపు అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు ఎంపికచేసే నిమిత్తం ఆంగ్ల మాధ్యమంలో బోధనా యోగ్యతలను తెలుసుకునే లక్ష్యంతో సెంటర్ ఫర్ టీచర్ అక్రిడిటేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ భాగస్వామ్యంతో ఒక పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష రాసేందుకు ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈనెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా వారి పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 29వ తేదీ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్ష జరిగే సమయానికి 24 గంటల ముందు మాత్రమే దరఖాస్తు చేసుకున్నవారి మెయిల్‌లకు పరీక్షకు సంబంధించిన సూచనలు పంపుతారని డీఈవో తెలిపారు.

బాలికల ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక బాలికల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2023-24 విద్యా సంవత్సరానికి పలు కోర్సుల్లో 3వ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, సూయింగ్ టెక్నాలజీ (టైలరింగ్) ట్రేడ్స్‌లో ప్రవేశాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో తమ దరఖాస్తులను ఈనెల 27వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం ప్రింట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు ఫారం, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఒంగోలు ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగే సర్టిఫికెట్ ధ్రువీకరణకు హాజరుకావాలన్నారు. అడ్మిషన్ సమయంలో అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. పూర్తి వివరాలకు సెల్ 8977711292 లేదా 7799976888 నంబర్లను సంస్థ పనివేళల్లో సంప్రదించాలన్నారు.

పెద్దాస్పత్రికి ఆధునిక హంగులు



నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీయూ

జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించేలా సర్వజన ఆస్పత్రికి ఆధునిక హంగులు సమకూరుతున్నాయి. ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో జీజీహెచ్‌కు మహర్దశ పట్టింది. కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి. ఆస్పత్రికి వస్తున్న పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అత్యాధునిక యంత్రాలు, ఐసీయూ కాంప్లెక్స్‌లు, ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అలాగే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను సైతం అందుబాటులోకి తెచ్చారు. రిమ్స్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ కళాశాలలో సైతం పీజీ సీట్ల సంఖ్యను పెంచారు.

నూతనంగా నిర్మించిన ఆడిటోరియం



- అందుబాటులో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- మరమ్మతులు, ఆధునికీకరణకు రూ.3 కోట్లు
- గడిచిన ఏడాదిలో ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2 కోట్ల ప్రతిపాదనలు
- రూ.23.75 కోట్లతో పలు అభివృద్ధి నిర్మాణాలు
- అందులో పీజీ విద్యార్థుల క్వార్టర్స్ నిర్మాణాలు ప్రారంభం
- 4 లెక్చరర్ గ్యాలరీలు, 2 పరీక్ష కేంద్రాల నిర్మాణాలు త్వరలో ప్రారంభం
- ఫార్మసీ సెంట్రల్ స్టోర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం

ఒంగోలు అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నగరంలోని జీజీహెచ్ రూపురేఖలు మారిపోయాయి. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.2 కోట్లతో 100 పడకలు కలిగిన ఐసీయూ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఎంఆర్‌ఐ, సీటీ స్కానింగ్ అత్యాధునిక యంత్రాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఎంఆర్‌ఐ, సి.టి. స్కాన్‌లు పూర్తి ఉచితంగా తీస్తూ కేవలం ఫిలింలకు నామమాత్రం ఫీజు వసూలు చేస్తున్నారు. రూ.7.5 కోట్లతో ఎంఆర్‌ఐ, రూ.2.5 కోట్లతో సి.టి. స్కాన్ యంత్రాలు ప్రస్తుతం రోగులకు సేవలందిస్తున్నాయి. వీటితో పాటు రూ.1.5 కోట్లతో ఫైర్ సేఫ్టీ, రూ.3 లక్షలతో ఆర్‌ఓ ప్లాంట్, రూ.9 లక్షలతో బ్యాటరీ వాహనాలు, రూ.3.5 లక్షలతో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, రూ.25 లక్షలతో 1100 ఆక్సిజన్ బెడ్లు, రూ.70 లక్షలతో సఖీ భవనం వంటివి పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చారు. నిరంతరాయంగా ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా 10 కేఎల్ ప్లాంట్‌లు 3, పీఎస్‌వీ ప్లాంట్‌లు 2 ఏర్పాటు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మామూళ్ల కోసం, నిర్లక్ష్యంతో నిలిచిపోయిన అభివృద్ధి పనులను సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తి చేశారు. అందులో ముఖ్యంగా రిమ్స్ ఆవరణలో ఉన్న ఆడిటోరియం నిర్మాణం గత ప్రభుత్వంలో నిలిచిపోయింది. ఇప్పుడు ఆడిటోరియానికి రూ.3.5 కోట్లు కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు.

మెడికల్ కాలేజీకి 65 పీజీ సీట్లు

గతంలో ప్రభుత్వ మెడికల్ కాలేజిలో 22 పీజీ సీట్లు ఫిజియాలజి (4), బయోకెమిస్ట్రీ (2), మైక్రో బయాలజీ (4), ఫార్మకాలజీ (4), ఫోరెన్సిక్ (2), పల్మనాలజి (2), సైకియాట్రి (2)) మాత్రమే ఉండేవి. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చాక 2023లో కొత్తగా మరో 65 పీజీ సీట్లు మంజూరు చేశారు. దీంతో మొత్తం 84 పీజీ సీట్లకు చేరింది. మంజూరైన పీజీ సీట్లలో పెథాలజి (9), కమ్యూనిటీ మెడిసిన్ (7), జనరల్ సర్జరీ (11), గైనిక్ (9), పీడియాట్రిక్ (7), ఈఎన్‌టీ (5), ఆప్తాల్మిక్ (5), రేడియాలజీ (5), ఎనస్తీషియా (7) సీట్లు మంజూరయ్యాయి. అయితే జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్ పీజీ సీట్ల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు.

రూ.3 కోట్లతో మరమ్మతులు:

జీజీహెచ్‌లో అవసరమైన మరమ్మతుల కోసం ఏపీఎంఐసీడీసీ రూ.3 కోట్లతో ప్రతిపాదనలు ఇవ్వగా ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో జీజీహెచ్‌లోని నీటి సరఫరా పైపు లైను, డ్రైనేజి పైప్‌లైన్, వాష్ రూమ్‌ల శానిటరీ పనులు, మార్చురీ రిపేర్, బ్లడ్ బ్యాంక్ ఆధునికీకరణ, కొత్తగా మరో ఆర్‌ఓ ప్లాంట్ ఇతర విద్యుత్ మరమ్మతులు చేపట్టారు.

రూ.23.75 కోట్లతో పలు అభివృద్ధి పనులు

మెడికల్ కాలేజి, ఆస్పత్రిలో రూ.23.75 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిలో క్రిటికల్ కేర్ సెంటర్, ఫార్మసీ సెంట్రల్ స్టోర్‌లు ఉన్నాయి. ఇది కాకుండా మరో రూ.98.4 లక్షలతో పీజీ క్వార్టర్స్ (మేల్, ఫీమేల్), 4 లెక్చరర్ గ్యాలరీలు, 2 పరీక్ష కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఆరోగ్యశ్రీ కింద రూ.2 కోట్లతో ప్రతిపాదనలు

జీజీహెచ్‌లో చికిత్స పొందే వారికి సంబంధించి అర్హత ఉన్న రోగులకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించి గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడా జులై వరకు 7,956 కేసులకు సంబంధించి సుమారు రూ.2 కోట్ల మేరకు ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ప్రతిపాదనలు పంపారు. దానిలో రూ.70 లక్షల వరకు మంజూరు కాగా మిగిలిన మొత్తం రానుంది. క్యాజువాలిటీలో కూడా ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో ఆరోగ్యశ్రీ ద్వారా జీజీహెచ్‌కు మరింత నగదు రానుంది. ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చిన డబ్బును పేషెంట్ కేర్, ఆస్పత్రి అభివృద్ధి, డాక్టర్లు, ఇతర మెడికల్ స్టాఫ్‌కు సంబంధించి వినియోగిస్తారు.



రిమ్స్ వైద్యశాల

పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందాలి



రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన మేరకు పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అన్నీ చర్యలు తీసుకున్నాం. వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి వైద్య సేవలు ప్రజలకు చేరువ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఉన్న జీజీహెచ్‌లో కూడా స్పెషాలిటీ సేవలు, ఓపీ, ఐపీ సేవలు పక్కాగా ప్రజలకు అందేలా అన్నీ రకాలుగా చర్యలు చేపట్టాం. ఆస్పత్రి అభివృద్ధితో పాటు రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశాం. మెడికల్ కాలేజిలో పెరిగిన పీజీ సీట్ల ద్వారా రానున్న రోజుల్లో జీజీహెచ్‌లో స్పెషాలిటీ వైద్య సేవలు విస్తృతపరుస్తాం.

– దినేష్‌కుమార్, కలెక్టర్

ఒకపక్క మెరుగైన వైద్య సేవలు.. మరోపక్క ఆస్పత్రి అభివృద్ధి



ప్రభుత్వ ఆదేశాలు, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్‌ల సూచనలతో జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూనే మరోపక్క ఆస్పత్రి అభివృద్ధి పనులు చేపట్టాం. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి పీజీ విద్యార్థులకు, ఆస్పత్రి ఉద్యోగులు, సిబ్బందికి, రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. మరో రూ.23 కోట్లపైగా పలు అభివృద్ధి పనులు చేశాం.

– డాక్టర్ చైతన్యవర్మ, ఆర్ఎంఓ, జీజీహెచ్

పేదల సొమ్ము కొల్లగొట్టిన టీడీపీ

- టిడ్కో పేరుతో ఇళ్ల కోసం డబ్బులు వసూలు చేసిన దామచర్ల
- పేదలకు ఆ డబ్బులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లిస్తోంది
- 14,400 మంది వద్ద డబ్బులు కట్టించుకొని 4 వేల ఇళ్లు మొదలు పెట్టారు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి




మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: పేదల సొమ్మును గత టీడీపీ పాలకులు కొల్లగొట్టారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని 5వ డివిజన్ రెండో వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం బాలినేని నిర్వహించారు. డివిజన్‌లోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు తూర్పు వైపున ఉన్న మహేంద్ర నగర్ ఒకటో లైన్ నుంచి మూడో లైన్ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ జీవిత కాలం టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నట్లుగా వాళ్ల భ్రమించి పేదలను నిలువునా మోసం చేసే కార్యక్రమానికి తెరలేపారన్నారు. ఒంగోలు నగరంలోని నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తామని నమ్మబలికి వాళ్ల నుంచి వేలకు వేలు డబ్బులు కట్టించుకొని నిలువునా మోసం చేశారని విమర్శించారు. టిడ్కో ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఇళ్లు ఇవ్వకపోగా వాళ్ల కట్టిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వకుండా ఇబ్బందిపెట్టారని మండిపడ్డారు. ఆ పేదల కడుపు కోతే టీడీపీని భూస్థాపితం చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళుతుంటే అయ్యా టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టాం.. ఇళ్లు ఇవ్వక పోగా, తాము కట్టిన డబ్బులు కూడా ఇవ్వటం లేదని ఆ నిరుపేదలు వాపోతున్నారని బాలినేని వివరించారు. అందుకే ముందు కట్టిన డబ్బులు వాళ్లకు తిరిగి ఇస్తున్నామని బాలినేని పేర్కొన్నారు. ఆ తరువాత వాళ్లందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి అనంతరం ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వమే ఆర్థిక సాయం చేస్తుందని భరోసా ఇస్తున్నామని వెల్లడించారు. 14,400 మంది వద్ద డబ్బులు కట్టించుకున్న టీడీపీ పాలకులు 4 వేల ఇళ్లు మాత్రమే ప్రారంభించి నిరుపేదలను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. ప్రతి గడపలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికీ ధైర్యంగా తిరుగుతున్నామని చెప్పారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఇటీవల ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు బాలినేనికి హారతులు, పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, ఎస్‌కే.మీరావలి, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, బొమ్మినేని మురళి, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతి రావు, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్ బాష, చావల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, దామరాజు క్రాంతి కుమార్, 5వ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.సత్య నారాయణ రెడ్డి, జమ్ము శ్రీకాంత్, తాళ్లపాలెం శ్రీను, సైదా, వాకా తిరుమల, పి.మోహన్ రావు, ఆసోది విజయలక్ష్మి, ఎస్‌కే.ఖుద్దూస్, రామిశెట్టి హరి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం సుబ్బులు, గఫూర్, అబ్దుల్ ఖుద్దూస్ , దాసరి అమ్మన్న, మద్దసాని సుబ్బారావు, హైమావతి, పులి కృష్ణ, మిరియం వెంకటేశ్వర్లు, కే.శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సాకారం కానున్న చిరకాల స్వప్నం

- వెలగలపాయ-పాపినేనిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ..51.16 కోట్లు
- అర్ధవీడు మండలంలో 13,500 ఎకరాలకు సాగునీరు, 20 గ్రామాలకు తాగునీరు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



వెలిగొండ ప్రాజెక్ట్ కాకర్ల గ్యాప్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ గురించి మంత్రులకు వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నా (ఫైల్)

అర్ధవీడు (కంభం): గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మండల ప్రజల చిరకాల స్వప్నం వెలగలపాయ-పాపినేనిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం మంగళవారం రూ.51.16 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా కాకర్ల గ్యాప్‌లో నీటి నిల్వ ఉన్నా ఆ నీళ్లు అర్ధవీడు మండల ప్రజలకు అందవు. వెలిగొండ ప్రాజెక్టు నీరు లోయ ప్రజలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అందించడం కోసం ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న అన్నా వెంకట రాంబాబు నాటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా 2011వ సంవత్సరంలో సాంకేతిక ఆమోదం పొంది 2012వ సంవత్సరంలో ఫైనాన్షియల్ ఆమోదం పొందారు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో పనులు మొదలు కాలేదు. 2019 లో గిద్దలూరు ఎమ్మెల్యేగా అన్నా వెంకట రాంబాబు విజయం సాధించిన నాటి నుంచి పట్టువదలని విక్రమార్కుడిలా వెలిగొండ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ సాధించడం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. గతేడాది సెప్టెంబరులో కాకర్ల గ్యాప్ పరిశీలించేందుకు వచ్చిన ఇరిగేషన్ మంత్రికి సైతం దాని ఆవశ్యకతను వివరించారు. పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు మొత్తం అంచనా విలువ రూ.300 కోట్లు కాగా మొదటి విడత కింద రూ.51.16 కోట్ల నిధులు మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం జీవో ఎం.ఎస్. నంబరు 65 ను విడుదల చేసింది. దీంతో అర్ధవీడు మండలంలోని రెండు లోయల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అర్ధవీడు మండలంలో 13,500 ఎకరాలకు సాగు నీరు, 20 గ్రామాలకు తాగు నీరందుతుంది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి సస్యశ్యామలంగా మారనుంది.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

అర్ధవీడు మండలానికి అత్యావశ్యకమైన లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిపోతుంది. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి జగన్‌కు చిరస్థాయిగా నిలిచిపోతారు.

– అన్నా రాంబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే



కనిగిరి - వెలిగండ్ల రహదారి ఇదే..

రుధిర దారి

- కనిగిరి–వెలిగండ్ల రహదారిలో రక్తపు మరకలు
- నాలుగు నెలల్లో రెండు హత్యలు
- కనిగిరిలో పోలీస్ గస్తీ పెరగాలంటున్న స్థానికులు

కనిగిరి రూరల్: కనిగిరి - వెలిగండ్ల రహదారిలో రక్తపు మరకలు అంటుకుంటున్నాయి. నిత్యం వాహన రాకపోకలు సాగిస్తున్న ఈ రోడ్డు మార్గంలో గతంలో కే రాధ హత్య ఘటన, నేడు విద్యార్థిని బీ మంజుల హత్య చోటుచేసుకున్నాయి. ఒకే రహదారిలో రాత్రి 6-8 గంటల మధ్యలోనే హత్యలు జరిగాయి. అంతేగాక ప్రధాన రోడ్డుకు ఎక్కడో దూరంగా జన సంచారం లేని ప్రాంతాల్లో జరిగినవి కాదు. కనిగిరి టు వెలిగండ్ల నిత్యం ఈ రోడ్డు మార్గంలో వందల వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. పల్లె గ్రామాలన్నీ పక్క పక్కనే రోడ్డు వెంబడే ఉంటాయి. కానీ దుండగులు మాత్రం ఈ దారినే ఎంచుకుని హత్యలు చేస్తున్నారు. అంతేగాక గతంలో హత్యకు గురైన రాధ మృతదేహం ప్రధాన రహదారిలో తారు రోడ్డుకు పక్కన 5 అడుగులు దూరంలోనే పడేశారు. అర్ధరాత్రి దాటే దాకా ఎవరూ గమనించ లేదు. గుర్తించలేదు. తాజాగా సోమవారం జరిగిన బీ మంజుల హత్యోదంతం కూడా అదే పరిస్థితి. కనిగిరి - వెలిగండ్ల ప్రధాన రోడ్డుకు 20 అడుగుల దూరంలో, కనిగిరి - సుల్తాన్‌పురం కాలినడక మార్గంలో రోడ్డుకు అడుగు దూరంలోనే మృతదేహం పడేశారు. మంజుల హత్య కూడా 6-7 గంటల మధ్యలోనే జరిగిందనేది పోలీసుల విచారణలో స్పష్టంగా తేలింది. దాన్నిబట్టి చీకటి పడక ముందే మంజుల హత్య జరిగిందని భావించవచ్చు.



సీసీ పుటేజీలో కూతురు మంజులను తీసుకెళ్తున్న తండ్రి వెంకటేష్

పోలీసింగ్ మరింత పెరగాలి..

నాలుగు నెలల వ్యవధిలో ఒకే రోడ్డులో సుమారు 10 కి.మీల దూరంలో రోడ్డు పక్కనే రెండు హత్యలు జరగడం పట్ల కనిగిరిలో చర్చనీయాంశంగా మారింది. కనిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని లేదా వెలిగండ్ల స్టేషన్ పరిధిలోని మొబైల్ టీం రాత్రి పూట కచ్చితంగా గస్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. వారంలో మూడు రోజులు కనిగిరి స్టేషన్ నుంచి వెలిగండ్ల వరకు, మరో మూడు రోజులు వెలిగండ్ల నుంచి కనిగిరి వరకు పోలీసింగ్ నిర్వహించి మరో నేరం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేగాక కనిగిరి-పామూరు రోడ్డులోని డిగ్రీ కళాశాల ప్రాంతంలో.. కనిగిరి-పొదిలి రూట్‌లోని లారీ ఆఫీస్ అవుట్ కట్స్ ఏరియాలో, కనిగిరి-కందుకూరు రోడ్డులోని చిన ఇర్లపాడు అవుట్ కట్స్ ఏరియాలో, గార్లపేట రోడ్డులోని క్వారీ అవుట్ కట్స్ ఏరియాలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తప్పనిసరిగా ప్రతి రోజు పోలీస్ గస్తీ నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మంజుల మృతదేహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన



చిల్లచెట్లలో పడి ఉన్న స్కూల్ బ్యాగ్, పుస్తకాలు

క్లుప్తంగా

సెలవులపై వెళ్లిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ వ్యక్తిగత పనులపై బుధవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు సెలవులపై వెళ్లారు. దీంతో ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ విదేశీ పర్యటనకు వెళ్లినట్లు సమచారం.

సమగ్రశిక్షలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ అర్హులైన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఈనెల 30వ తేదీ సాయంత్రం 8 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్–1, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్–1, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్–1, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్–1 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకున్నవారు విడివిడిగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో 'టంగుటూరి జయంతి'

ఒంగోలు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని డీఈఓ వీఎస్ సుబ్బారావు ఆదేశించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని హెచ్‌ఎంలకు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

చంద్రయాన్–3 ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించాలి

ప్రపంచంలోనే తొలిసారిగా చంద్రుని దక్షిణ ధ్రువంపై బుధవారం సాయంత్రం చంద్రయాన్–3 ల్యాండింగ్ అవుతోందని, జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించి అవగాహన పొందాలని డీఈఓ వీఎస్ సుబ్బారావు సూచించారు. బుధవారం సాయంత్రం 5.27 గంటలకు ఇస్రో వెబ్‌సైట్, యూట్యూబ్ చానల్, ఫేస్ బుక్ పేజీ, దూరదర్శన్ జాతీయ చానల్‌లో చంద్రయాన్–3 ప్రత్యక్ష ప్రసారాన్ని గంటపాటు వీక్షించవచ్చని పేర్కొన్నారు.

నేడు ఏకేయూలో ప్రకాశం పంతులు జయంతి

ఒంగోలు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి కార్యక్రమం బుధవారం ఉదయం 11గంటలకు స్థానిక యూనివర్శిటీ ఆవరణలో నిర్వహించనున్నట్లు యూనివర్శిటీ డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరి వెంకట శ్రీనివాసులు హాజరవుతారన్నారు.

ముగ్గురు యువకులపై అట్రాసిటీ కేసు నమోదు

సింగరాయకొండ: స్థానిక సెబ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై దయాకర్ విధులను ఆటంకపరచడంతో పాటు కులం పేరుతో దుర్భాషలాడారన్న ఆరోపణపై వై.చిన్నా, మరో ఇద్దరిపై సోమవారం రాత్రి ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో పాతసింగరాయకొండ పంచాయతీలోని తుఫాన్ షెల్టర్ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,55,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులతోపాటు నగదును సెబ్ ఎస్సై దయాకర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే సోమవారం సాయంత్రం చిన్నా, శ్రీధర్, విశ్వనాథ్ సెబ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పెద్దగా అరుస్తూ విధులను ఆటంకపరచడంతో పాటు కులం పేరుతో దూషించి భయభ్రాంతులకు గురిచేశారని సెబ్ ఎస్సై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.శ్రీరామ్ వివరించారు.

మహిళా టీచర్‌ను వేధిస్తున్న సీఆర్పీపై కేసు

ఒంగోలు టౌన్: ఒక మహిళా టీచర్‌ను వేధిస్తున్న సీఆర్పీపై వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న మహిళా టీచర్‌ను సీఆర్పీ చంద్రశేఖర్ తరచూ వేధిస్తున్నాడు. తనతో సన్నిహితంగా మెలగకపోతే ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించడమే కాకుండా తనతో గడపాలని వేధిస్తున్నాడు. అంతటితో ఊరుకోకుండా మహిళా టీచర్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లగా విషయాన్ని తన భర్తకు చెబుతానని, అలాగే నీ భార్యతో కూడా మాట్లాడదామని హెచ్చరించారు. ఈ క్రమంలో సీఆర్పీ చంద్రశేఖర్ మరోమారు మహిళా టీచర్‌కు ఫోన్ చేసి.. ×నీ గురించి చెడుగా ప్రచారం చేస్తా.. నేను రైలు కింద పడి చనిపోతా₹ అని బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరించాడు. సోమవారం సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి వెళ్తున్న మహిళా టీచర్‌ను అటకాయించి ఇబ్బంది పెడుతుండటంతో ఆమె దిశ ఎస్‌ఓఎస్‌కు ఫోన్ చేశారు. వెంటనే వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

రాష్ట్రంలో విద్యకు పెద్దపీట

- విదేశాల్లో ఉన్నత చదువులకు ప్రోత్సాహం
- చదువులకు ఎంత ఖర్చయినా ప్రభుత్వానిదే బాధ్యత
- గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేశారని, విదేశాల్లో ఉన్నత చదువులకు సైతం ఆర్థికపరంగా చేయూతనిస్తూ ప్రోత్సహిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.18 కోట్లతో నిర్మించిన తరగతి గదులు, రూ. 80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం–1, 2 నూతన భవనాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను నాశనం చేసిందని, డబ్బున్న వారి పిల్లలు చదువుకునే విధంగా కార్పొరేట్ స్కూళ్లను ప్రోత్సహించిందని, విద్యను అడ్డంపెట్టుకొని వ్యాపారం చేసుకునే బడాపెట్టుబడిదారులకు చదువుల తల్లిని తాకట్టుపెట్టారని విమర్శించారు. దశాబ్దాల కాలంగా శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల్లోనే బడుగు, బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లలు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్రంలో అనేక చోట్ల పాఠశాల గోడలు కూలి విద్యార్థులు మరణించిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బోధించే ఉపాధ్యాయులులేక విద్యార్థులు అర్ధంతరంగా బడికి వెళ్లడం మానివేసేవారని, ఉన్నత చదువులు చదువుకోవటానికి చేతకాక కూలి పనులకు వెళ్లేవారన్నారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అటువంటి ఇబ్బందులు లేవని, ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని కొనియాడారు. రాష్ట్రంలో ఉన్న 42వేల పాఠశాలల్లో మొదటి విడత కింద రూ.3,669 కోట్లతో 15,713పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి ప్రతి పేద విద్యార్థి బడికి బాటలు వేయించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, బెల్టులు, పాఠ్య పుస్తకాలు అందచేస్తున్నామని, నాడు–నేడు రెండో విడత కింద రూ.8వేల కోట్ల ఖర్చుతో 22,344 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థుల చదువులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని, అందుకు ఎంత ఖర్చయినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెనకంజ వేయడం లేదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. పుల్లలచెరువు పాఠశాలలో భోజనశాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని, అందుకు అంచనాలు తయారుచేసి వెంటనే తనకు పంపాలని ఆమె అధికారులను ఆదేశించారు.

గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు

మహాత్మా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యంవైపు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని, అందులో భాగంగా ప్రజల వద్దకు పరిపాలన తీసుకొని వెళ్లాలన్న ఉద్దేశంతో గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారని మంత్రి సురేష్ అన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ చేరువచేయటానికి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని, ఈ వ్యవస్థలతో వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, వైఎస్సార్ సీపీ పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల అధ్యక్షులు బీవీ సుబ్బారెడ్డి, కె.ఓబులరెడ్డి, ఎంపీటీసీ రాములు, సర్పంచ్ ఓబులేసు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాచగొర్ల సుశీల పిచ్చయ్య, సచివాలయాల మండల కన్వీనర్లు డి.వెంకటేశ్వర్లు, సయ్యద్ జబీవుల్లా, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు గాలిరెడ్డి, డైరెక్టర్లు జానకిరఘు, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, ఆవుల రమణారెడ్డి, కేశవరెడ్డి, కె.కాశయ్య, బి.హనుమంతరావు, లక్ష్మణ్ నాయక్, తహసీల్దార్ కె.దాస్, పీఆర్ డీఈఈ సుబ్బారెడ్డి, ఈఈపీఆర్డీ బాలునాయక్, ఎంఈఓ సామ్యూల్‌జాన్ పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి

- తాగునీటి కుళాయిల పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి మంగళవారం మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుందన్నారు. సత్వరమే బిల్లులు కూడా చెల్లింస్తున్నందున పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఇప్పటికీ ప్రారంభం కానీ గ్రామాల్లో నిర్మాణాలకు అవసరమైన స్థలాలను, కాంట్రాక్టు సంస్థలను వారంలోగా గుర్తించాలన్నారు. పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేసేలా చూడాలన్నారు. తడి, పొడి చెత్తను ఇళ్ల వద్దే వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వేసిన లే అవుట్‌లకు అవసరమైన అనుమతులు పెండింగ్ లేకుండా సెప్టెంబర్ 15 నాటికి నివేదిక అందచేయాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటి సరఫరాకు సంబంధించి అవసరమైన పైప్‌లైన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. చీమకుర్తి వెనుకబడి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పైపులైన్ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలశక్తి అభియాన్ పనులు కూడా వచ్చే నెల మొదటి వారానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ముగింపు దశలో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు (సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్) ఈ నెలాఖరుకు పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వ చేపట్టిన చర్యలకు తోడు వాటి పూర్వ విద్యార్థుల సహకారం కూడా తీసుకోవాలన్నారు. మన బడి- మన బాధ్యత కార్యక్రమంలో పూర్వ విద్యార్థులను భాగాస్వాములు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరును ప్రతి రోజు పరిశీలించాలని, నమోదైన పిల్లలంతా తప్పనిసరిగా అంగన్‌వాడీలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీపీఓ నారాయణరెడ్డి, డ్వామా పీడీ శీనారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య, డీఈఓ సుబ్బారావు, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, డీఎస్‌ఓ ఉదయభాస్కర్, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఓయుడీఏ వీసీ నిరంజన్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గ్లోరియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

19 నుంచి డీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు: డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ 2022–24 బ్యాచ్, 2020–22 , 2021–23 సంవత్సరాల్లో పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు సెప్టెంబర్ 19 నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సబ్జెక్టుకు రూ.100, రెండో సబ్జెక్టుకు రూ.120, మూడో సబ్జెక్టుకు రూ.140, అంతకు మించి సబ్జెక్టుకు రూ.150 పరీక్ష ఫీజు ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించాలన్నారు. సెప్టెంబర్ 6వ తేదీ లోగా రూ.50 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోకేష్.. ఇక బీసీలను మభ్యపెట్టడం కల్ల

- మీరు చెప్పే రోజుకో అబద్ధాలను నమ్మే పరిస్థితిలో బీసీలు లేరు
- చంద్రబాబు హయాంలో బీసీలకు ఎంత ఖర్చుచేశారో సమాధానం చెప్పాలి
- ఎంఎల్‌సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



ఎంఎల్‌సీ పోతుల సునీత

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలు చైతన్యవంతం అయ్యారని, పనిముట్లు చేతిలో పెట్టి బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకునే తెలుగుదేశం పార్టీ విధానం ఇక చెల్లదని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేస్తున్న పాదయాత్ర కామెడీ గళంగా మారుతుందని విమర్శించారు. రోజుకో అబద్ధం చెప్పడం మాని బీసీలకు గత ప్రభుత్వ హయాంలో ఎంత ఖర్చు చేశారో లెక్కలు చెప్పాలన్నారు. అర్జంటుగా చేనేతలు, నాయీబ్రాహ్మణులపై లోకేష్ అమితప్రేమ కనబరుస్తుండడం కేవలం ఓటు బ్యాంకు కోసమే అన్నారు. నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, చేనేతలను చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉండి ఎంత దారుణంగా అవమానించిందీ అందరికీ తెలుసన్నారు. కానీ నేడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలకు నేతన్న నేస్తం ద్వారా 22 వేలమందికి ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున రూ.996 కోట్లు వెచ్చించారన్నారు. నేతన్నలకు పెన్షన్ కానుక కింద రూ.1400 కోట్లు, ఆప్కోకు రూ.500 కోట్లు ఆర్థికసాయం, చంద్రబాబు ప్రభుత్వంలో బకాయిలు చెల్లించకుండా వదిలేసిన రూ.100 కోట్లు, నవరత్నాల కింద మరో రూ.1300 కోట్లు ఇలా నాలుగేళ్ల పాలనలో రూ.4 వేల కోట్లకుపైగా నిధులను చేనేతల కోసం ముఖ్యమంత్రి చెల్లించారన్నారు. ఇరువురికి శాసనమండలి సభ్యులుగా, చేనేతలకు నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతోపాటు రాష్ట్రంలోని చీరాల, మంగళగిరి, పెడన, ధర్మవరం వంటి పలు చేనేత వస్త్రాల విక్రయానికి ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది మాత్రమే అన్నారు. కేవలం గోబెల్స్ ప్రచారం ద్వారా బీసీలను వంచించాలనుకునే మీ వైఖరి ఇక చెల్లదని, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా చైతన్యవంతమయ్యారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. 2019లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏవిధంగా అయితే తెలుగుదేశం పార్టీకి గుణపాఠం చెప్పారో 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్న వైనాట్ 175 లక్ష్య సాధనకు కట్టుబడి ఉన్నారని ఎంఎల్‌సీ పోతుల సునీత స్పష్టం చేశారు.

27న 'మండలి'కి జీవిత సాఫల్య సృజన పురస్కారం

- కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు మెట్రో: ఆగస్టు 27న సృజన సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) సప్తతి అభినందన సభ సందర్భంగా జరిగే కార్యక్రమాల కరపత్రాలను మంగళవారం ఉదయం పట్టణ ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ శ్రీనివాసరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను బతికించేందుకు నిరంతరం కృషి చేస్తున్న డా.మండలి బుద్ధ ప్రసాద్‌కు జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. కళామిత్ర మండలి అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎక్కడ సాహిత్య సభలు జరిగినా తమవంతు సహాయం చేసే రుద్రయ్య లాంటి వ్యక్తులు సప్తతి జయంత్సవం జరుపుకోవడం, వందమంది కవులను సత్కరించటం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కరపత్ర ఆవిష్కరణలో డా.నాగభైరవ ఆదినారాయణ, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, యువి.రత్నం, నూకతోటి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొనాలని కోరారు.

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య



శ్రీరాములు మృతదేహం

కొండపి: అనారోగ్యం, మానసిక ఒత్తిడి కారణంగా ఓ యువకుడు పురుగు మందు తాగి అర్ధంతరంగా తనువు చాలించాడు. ఈ సంఘటన మంగళవారం కొండపి మండలంలోని అనకర్లపూడిలో చోటుచేసుకుంది. మృతుడి బంధువుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుమ్మళ్ల శ్రీరాములు(33) గ్రామ సచివాలయ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యం బాధపడుతున్న శ్రీరాములు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి వడ్డెపాలెంలో ఒక మహిళ వద్ద కొన్ని కాగితాలు తీసుకున్నాడు. అనంతరం గ్రామానికి సమీపంలోని పొలాల వద్దకు ఉదయం సుమారు 9 గంటల సమయంలో వెళ్లి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి సెల్‌ఫోన్ పగలగొట్టాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలువురు యువకులతో కలిసి వెతకగా పొలాల్లో శ్రీరాములు అచేతనంగా పడి ఉన్నాడు. హుటాహుటిన కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వైవీ రమణయ్య తెలిపారు.

24 మంది వీఆర్‌ఓలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి



జేసీని సన్మానిస్తున్న వీఆర్‌ఓల సంఘ అధ్యక్షుడు రాము

ఒంగోలు అర్బన్: జిల్లాలో గ్రేడ్–1 వీఆర్‌ఓలుగా పనిచేస్తున్న 24 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పదోన్నతి పొందిన వీఆర్‌ఓలకు పోస్టింగ్‌లు కేటాయించారు. జిల్లా వీఆర్‌ఓల సంఘ అధ్యక్షుడు పి.రాము ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన వీఆర్‌ఓలు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలతలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.చిరంజీవి పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు వైద్య సేవలపై ప్రత్యేక మార్గదర్శకాలు

ఒంగోలు అర్బన్: హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు మాతృ మరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసవానికి ముందు, తర్వాత కూడా పీహెచ్‌సీ నుంచి ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పింస్తోందని పేర్కొన్నారు. హైరిస్క్, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వడంతోపాటు మూడో నెల నుంచి 9వ నెల వరకు ప్రత్యేకంగా వైద్యుల పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో పీహెచ్‌సీకి వచ్చేందుకు, తిరిగి ఇంటికి వెళ్లేందుకు వాహన సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. బాలింతలకు హిమోగ్లోబిన్ స్థాయి పెంచేందుకు వివిధ రకాల మందులు ఇస్తామని, బిడ్డ ఎదుగుదల తెలుసుకునేందుకు రెండుసార్లు ఎంటినేటల్ స్కాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, టిఫా స్కాన్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. ప్రసవం ఎక్కడ జరిగినా ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన జెట్టి వెంకటేశ్వర్లు

కంభం: మండలంలోని రావిపాడు గ్రామంలో ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన జెట్టి వెంకటేశ్వర్లు(45)కు మొదటి భార్య చనిపోగా 13 ఏళ్ల క్రితం కురిచేడు మండలం బోదనంపాడు గ్రామానికి చెందిన రాజేశ్వరిని రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ముగ్గురు సంతానం కాగా, రెండో భార్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం రాత్రి మద్యం సేవించి పడుకున్న వెంకటేశ్వర్లు రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిసింది. మద్యం మత్తులో తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని చుట్టుపక్కల వారికి, బంధువులకు అతని భార్య సమాచారం అందించింది. దీంతో బంధువులు మృతుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. వెంకటేశ్వర్లు మృతిపై అనుమానం వ్యక్తం చేసిన సోదరి, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాజేశ్వరిని తమదైన శైలిలో విచారించడంతో మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చినట్లుగా నేరం ఒప్పుకున్నట్లు తెలిసింది. కుటుంబ కలహాల నేపథ్యం, మొదటి భార్య సంతానం అడ్డుగా ఉన్నారనే కారణంతోనే రెండో భార్య ఈ ఘాతుకానికి పాల్పడిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

యోగా చాంపియన్‌షిప్‌కు పెద్దదోర్నాల విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: కర్నూలులో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా చాంపియన్‌షిప్‌కు పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రామానాయక్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి యోగా ఆన్‌లైన్ చాంపియన్‌షిప్‌లో పీవీ వీరాంజనేయులు, పి.శ్రీను, గాయత్రీబాయి ప్రతిభ కనబరిచారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఉపాధ్యాయులు మహేశ్వరరెడ్డి, ప్రేమ్‌చంద్, సెక్రటరీ నాగమూర్తి, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఆకాంక్షించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

చీమకుర్తి: పిడుగుపాటుకు మహిళ మృతి చెందిన సంఘటన సంతనూతలపాడు మండలం వేములపాడులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. కాకుమాను సుశీల(35) గేదెలను మేత కోసం పొలానికి తోలుకెళ్లింది. సాయంత్రం ఇంటికొస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో ఒక్కసారిగా పిడుగుపడటంతో సుశీల అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు విషయం తెలియజేశారు.

సృజన

హ్యాపీ స్పేస్

యాంత్రిక ప్రయాణంలో పోటీ ఎప్పుడూ ఉండేదే! కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు అమ్మ కళ్లలో.. కలల్లో చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది. 'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి. హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి నేచురల్ కలర్స్ వాడకం గురించి అపార్ట్‌మెంట్ పిల్లలకు పరిచయం చేస్తూ కనిపించారు. ఆసక్తితో ఆమె చేస్తున్న పని గురించి ప్రశ్నించినప్పుడు పిల్లల కోసం తను సృష్టించిన సహజ ప్రపంచాన్ని మన ముందుంచారు..



భార్గవి



ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...

నిశితంగా తెలుసుకుంటూ...

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లై, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, పైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్ తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలామంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు. ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రెయిన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి

ఫొటో: మోహనాచారి

న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందువల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం



మాన్య





పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్లలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లుగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.

బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ల మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్లు ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లలోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?', 'న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్', 'ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్జీ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వీ మేళా, అక్షయ్‌కల్ప రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తినిచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు

సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...

యూత్ పల్స్



ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్ బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్టులతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటి' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారి పోటర్' సిరీస్ లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రెటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్ బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.

'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్– జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.

